క్లుప్తంగా

జిల్లా సెక్టోరియల్ అధికారికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో వారం రోజుల పాటు 'తొలిమెట్టు'లో భాగంగా జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సరళమైన పద్ధతిలో అవగాహన కల్పించారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు సోమవారం ఉపాధ్యాయులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, నోడల్ అధికారి వై.సత్యనారాయణ, తొలిమెట్టు జిల్లా పరిశీలకుడు విద్యాసాగర్, రిసోర్స్‌పర్సన్స్‌లు రజిత, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి తహసీల్దార్‌గా మహేంద్రనాథ్



కోటపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా మహేంద్రనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆదిలాబాద్ నుంచి కోటపల్లికి రాగా, గతంలో పనిచేసిన సునీల్‌కుమార్ మంచిర్యాల కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మహేంద్రనాథ్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి, ప్రజలు సహకరించాలని కోరారు. తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ



ర్యాలీకి మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు

జన్నారం: మణిపూర్‌లో కొనసాగుతున్న మారణ కాండను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి అంగడి బజార్ వరకు క్రైస్తవులు నిరసన ర్యాలీ తీశారు. వీరికి కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు మద్దతు తెలుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు భరత్‌కుమార్, మున్వర్‌అలీఖాన్, సీపీఎం నాయకులు అశోక్, బుచ్చన్న, కాంగ్రెస్ నాయకులు ప్రభుదాస్, ఇందయ్య, రమేశ్, ఫాస్టర్లు సంతోష్‌రాజ్, అభిషేక్, జీవన్, సుభాష్, షాలెం, ప్రవీన్, దావిద్, మంద రాజేశ్, రాము, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: ఈ నెల 25, 26, 27తేదీల్లో గోదావరిఖనిలో జరిగే ఏఐటీయూసీ 16వ కేంద్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ నాయకులు హాజరవుతారని, అధిక సంఖ్యలో కార్మికవర్గం హాజరుకావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ తలపెట్టిన చలో అసెంబ్లీ సందర్భంగా ముందస్తు అరెస్టులను ఖండిస్తూ సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు అభినవ్, సత్యానారాయణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాలాజీప్రసాద్, వెంకటేశ్వరరావు, ఎంఈవో ప్రభాకర్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో నివాళులు



సీసీసీ కార్నర్ వద్ద కొవ్వొత్తులతో నివాళి



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న నాయకులు

గద్దర్‌కు ఘన నివాళి

జన్నారం/మందమర్రిరూరల్/మంచిర్యాలటౌన్/లక్సెట్టిపేట/నస్పూర్/దండేపల్లి/పాతమంచిర్యాల/బెల్లంపల్లి/వేమనపల్లి/కాసిపేట: ప్రజా గాయకుడు అమరజీవి గద్దర్ అకాలమృతికి సంతాపంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గద్దరన్న పాటలతో ప్రజల్లో చైతన్యం నింపారని, రాష్ట్ర ఏర్పాటులో గద్దర్ పాత్ర మరువలేనిదని పలువురు వక్తలు కొనియాడారు.



బెల్లంపల్లిలో గద్దర్ చిత్రపటంతో ర్యాలీ తీస్తున్న కళాకారులు

బెల్లంపల్లిలో తెలంగాణరాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. నస్పూర్‌లో మంగళవారం నిర్వహించే గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని చైతన్య యూత్ సభ్యులు కోరారు.పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.



కాసిపేట గనిపై...



లక్సెట్టిపేటలో...



దండేపల్లిలో...

'చలో కోరుట్ల' విజయవంతం చేయండి

భీమారం: పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు రాజ్యాధికార సాధన కోసం ఈ నెల 13న నిర్వహించే 'చలో కోరుట్ల' పోస్టర్‌ను సోమవారం భీమారంలో ఆయన ఆవిష్కరించారు. సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ఆవిడపు వెంకటేష్, మండలఅధ్యక్షుడు గుడిమల్ల వెంకటేష్, కార్యదర్శి బండి శ్రీరాములు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం: మండలకేంద్రంలో సోమవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో 'చలో కోరుట్ల' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్ మాట్లాడుతూ.. పద్మశాలీ కులస్తులను ఏకం చేయడానికి, కులం బలం చూపడానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పద్మశాలీ కులస్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, భాస్కర్, రవీందర్, చందు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



భీమారంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుదర్శన్

దండేపల్లి: ఈ నెల 13న కోరుట్లలో పద్మశాలీల సభ నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, వెంకటేశం తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను స్థానిక మార్కండేయ టెంపుల్ వద్ద సోమవారం ఆవిష్కరించారు. సభకు జిల్లాలోని పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలిరావాలాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు వడ్డేపల్లి దేవయ్య, పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శంకర్, పద్మశాలీ సంఘం నాయకులు ఆడెపు సురేష్, వడ్డేపల్లి జ్ఞానయ్య, సత్యం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలీలు

రామకృష్ణాపూర్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో మోటార్‌బైక్ ర్యాలీ చేపట్టారు. స్థానిక బీజోన్ రాజీవ్‌చౌక్ నుంచి గద్దెరాగిడి అమ్మాగార్డెన్స్ వరకు ర్యాలీ సాగింది. చేనేత రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించి చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చేనేత కార్మికులకు వడ్డీ లేని రుణాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు వనం సత్యం, వొడ్నాల శ్రీనివాస్, ఆడెపు తిరుపతి, వేముల వెంకటేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల 'భవిత'కు భరోసా

నెన్నెల: పుట్టుకతో, చిన్న వయస్సులో వైకల్యం ఏర్పడి దివ్యాంగులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లల భవిష్యత్‌కు భరోసా ఇస్తూ భవిత కేంద్రాలు విశేష సేవలు అందిస్తున్నాయని ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. నెన్నెలలోని దుబ్బపల్లి(ఎస్) పాఠశాలలో సోమవారం దివ్యాంగుల విద్యార్థులు, తల్లిదండ్రులకు ఫిజి యోథెరపి సేవలపై అవగాహన కల్పించారు. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన 6 నుంచి 18ఏళ్ల లోపు పిల్లలను గుర్తించి భవిత కేంద్రానికి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. శిక్షణ ద్వారా ప్రత్యేక అవసరాల నుంచి విముక్తి చేసి వికలాంగులను సామాన్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అన్ని రకాల వసతులు కల్పిస్తూ వారికి కావాల్సిన సామాగ్రి, ఫిజియోథెరపి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు మల్లన్న, రమేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి

భీమారం: దివ్యాంగపిల్లల కోసం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆసరా భవిత కేంద్రంను ఎంఈవో రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. 18సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లలకు ఈ కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. పిల్లల వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపించి, వారికి రావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. పిలలకు ప్రత్యేక విద్యాబోధనతో పాటు ఫిజియోథెరిపి కూడా చేస్తామని తెలిపారు.

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎంఈవో రాధాకృష్ణమూర్తి తెలిపారు. 18ఏళ్ల లోపు దివ్యాంగులు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రానికి వచ్చే దివ్యాంగులు ఐఈఆర్‌పీలు శ్రీనివాస్, శ్రీకాంత్‌లను సంప్రదించాలని కోరారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న రఘునాథ్

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సేవాభారతి ఎల్లప్పుడు సహకారం అందిస్తుందని సంస్థ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రఘునాథ్ అన్నారు. మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాలలో 150మంది విద్యార్థులకు సోమవారం స్కూల్ కిట్ (బ్యాగ్, నోట్‌బుక్స్, జామెట్రీబాక్స్) అందించారు. కార్యక్రమంలో సేవా భారతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, సభ్యులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు శారద పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 4వ వార్డు వంద ఫీట్ల రోడ్డులో భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ దిక్కూచి భగత్‌సింగ్‌నగర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు పడాల రామన్న, అధ్యక్షుడు దుర్గం స్వామి, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పూదరి తిరుపతి, మల్లెంపల్లి పురుషోత్తం, కార్యదర్శులు రుద్దుల నారాయణ, రవీందర్ రెడ్డి, సింగతి సత్తయ్య, సహాయ కార్యదర్శులు ముత్తె రాజలింగు, దుర్గం వెంకటస్వామి, ప్రచార కార్యదర్శులు వెంకటేశ్ పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

నెన్నెల: ప్రజాగాయకుడు గద్దరన్న కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సోమవారం సమతా సైనిక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దార్థ, రాంమూర్తి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, గద్దర్ జీవితచరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గద్దరన్న పాత్ర అతిముఖ్యమైనదని, తన జీవితాంతం ఉద్యమాలకే పరిమితమయ్యారన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు టాలెంట్ పరీక్ష

నస్పూర్: జూనియర్ ఛాంబర్ ఇంటర్ నేషనల్ (జేసిఐ)మంచిర్యాల ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు జాతీయ స్థాయి టాలెంట్ సెర్చ్ పరీక్షను నిర్వహించారు. సీసీసీ సింగరేణి హైస్కూల్, శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన పరీక్షకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ఎక్సామ్ కన్వీనర్ జేసీ సత్యకళ్యాణరాం, ట్రెజరర్ జేసీ వెంకటేశ్, సీసీసీ సింగరేణి పాఠశాల హెచ్ఎం ఆర్.రాధాకృష్ణ, ఎయిమ్స్ పాఠశాల కరస్పాండెంట్ మైదం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సోలార్ విద్యుత్‌పై ఇంటింటా సర్వే'

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో మంగళవారం స్త్రీనిధి జిల్లా మేనేజర్ సంతోష్, సర్పంచ్ ఇందూరి శశికళతో కలిసి సోలార్ విద్యుత్‌పై ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

పశువులకు టీకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గొల్లపల్లిలో సోమవారం దొనబండ పశువైద్య ఆస్పత్రి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు, ఉచిత నట్టల నివారణ మందులు, ఉచిత ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేశారు. నెల రోజుల పాటు పశువులకు టీకాలు, నట్టల నివారణ మందులు వేయనున్నట్లు పశు యజమాన్యాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దొనబండ పశువైద్యాధికారిణి డాక్టర్ సరిత తెలిపారు.

ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: మండలంలోని శంకర్‌పల్లికి చెందిన దర్శనాల రమేశ్ ఇటీవల శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మేముసైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు మిత్రుల ద్వారా సేకరించిన రూ.15వేలు నగదును సోమవారం రమేశ్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు భూబత్తుల శ్రీనివాస్, సభ్యులు సోమయ్య, చంద్రకాంత్, తిరుమలేష్ ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

జైపూర్: మండల తహసీల్దార్‌గా కె.రమేశ్ ఇటీవల బాధ్యతలు స్వీకరించగా సోమవారం మండల ప్రజాప్రతినిధులు, తెలంగాణ జాగృతి నాయకులు సన్మానించారు.

గడపగడపకూ బీజేపీ

నెన్నెల: మైలారంలో సోమవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ ఆధ్వర్యంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు.

బీపీ మండల్‌కు నివాళి

పాతమంచిర్యాల: బీపీ మండల్‌కు భారతరత్న బిరుదు ఇచ్చి సత్కరించాలని యాదవ సమితి నాయకులు, తెలంగాణ బీసీ జాగృతి నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం బీపీ మండల్ డే ను నిర్వహించారు.

'ఎగ్జిబిషన్‌కి అనుమతులు ఇవ్వొద్దు'

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ పీహెచ్‌సీ ఎదురుగా సర్వే నంబరు 42ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్‌కి అధికారులు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని నేషనల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జుమ్మిడి గోపాల్, తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా నాయకులు బచ్చలి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేశ్, మున్సిపల్ చైర్మన్ ఇసంపల్లి ప్రభాకర్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఎగ్జిబిషన్‌కి ఎలాంటి ఫైర్, సేఫ్టీ అనుమతులు లేవని, ఎగ్జిబిషన్ జాతీయ రహదారికి ఆనుకొని ఏర్పాటు చేస్తుడండంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పూరెళ్ల సతీష్, రేగుంట క్రాంతికుమార్, వంశీ, అఖిల్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని రాస్తారోకో

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లిలో చేపట్టే బీటీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కన్నెపల్లి స్టేజీ వద్ద రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడైందని, రోడ్డు గుండా ప్రయాణించడం చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితమే నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభించడంలో గుత్తేదారు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

'మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా కుటుంబంలో తలెత్తే సమస్యలను సమర్థవంతంగా నివారించుకోవాలని బ్రహ్మకుమారీస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బీ.కే లక్ష్మి తెలిపారు. కాల్‌టెక్స్‌లోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సోమవారం 'కుటుంబాన్ని సమర్థవంతంగా చేయడం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు శ్రేష్టమైన ఆలోచనలతో కుటుంబాన్ని సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యలను అధిగమించడం, అడ్డంకులను తొలగించుకోవడం ఎలాగో అవగాహన కల్పించారు. రాజమార్గం, జ్ఞానమార్గం ద్వారా ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడొచ్చని వివరించారు. ఇతర అంశాల గురించి అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత మాట్లాడుతూ.. సమస్యలకు కుంగిపోకుండా, నేర్పుతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సీడీపీవో ఉమాదేవి, బెల్లంపల్లి బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు బీకే పద్మ, సుప్రియ, శ్రీలత, కైవల్య, కౌన్సిలర్లు మంగలీల, లావణ్య, ప్రభాకర్, శ్రీనివాస్, రాముునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'తల్లి పాలు బిడ్డకు అమృతం'

మంచిర్యాలటౌన్: తల్లిపాలు బిడ్డకు అమృతం అని, తల్లిపాలు పట్టించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, బిడ్డ రోగాల బారిన పడకుండా రక్షణ కవచంలా తల్లి పాలు పనిచేస్తాయని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణ మెమోరియల్ నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో కలిసి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పిల్లల వైద్యుడు వేదవ్యాస్, మంచిర్యాల మహిళా తరంగిణి సభ్యులు గోనె భాగ్యలక్ష్మి, గోనె ఇందిరాదేవి, జ్యోత్స్న, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ చందూరి మహేందర్ పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. వార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తమ్మ, ఆసుపత్రి వైద్యురాలు ఎం.శ్వేత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ ప్రసవం అయిన నాటి నుంచి 6నెలల్లోపు బాలింతలు బిడ్డకు తల్లిపాలను అందించాలని తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు'

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'గడపగడపకూ కాంగ్రెస్' కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు నస్పూర్ మున్సిపాలిటీలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 13వ వార్డులో సోమవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రజల సమస్యలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు.



సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్: మందమర్రిరూరల్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయి. ఆదిల్‌పేట్, పులిమడుగు గ్రామాల్లో మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిమల్ల నర్సింగ్ వినతిపత్రం అందించారు. సారంగపల్లిలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ ఎంపీడీవో శశికళకు వినతిపత్రం అందించారు. అలాగే చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెవెన్యూకి సంబంధించిన ఒక ఫిర్యాదు వచ్చిందని ఎంపీడీవో టి.శ్రీనివాస్ తెలిపారు.

విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, నాయకులు

చెన్నూర్/దండేపల్లి/జన్నారం/కాసిపేట: ఈ నెల 9న మంచిర్యాలలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని, ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆదివాసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పంచాయతీ కార్మికుల రాస్తారోకో

దండేపల్లి/మందమర్రిరూరల్/వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట: పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని సోమవారం దండేపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో చేశారు. మందమర్రిరూరల్ మండల కేంద్రంలోని జీపీ కార్మికుల సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. వేమనపల్లిలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. హాజీపూర్‌లో సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లక్సెట్టిపేట గాంధీ చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. 33రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

రక్షణపై అవగాహన

నస్పూర్: గనిలో విధులు నిర్వర్తించే కార్మికులు, ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని కేజీఎస్ గుప్తా తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6గనిపై సోమవారం రక్షణపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేజీఎస్ గుప్తా మాట్లాడుతూ.. గనుల్లో ప్రమాదాలు తగ్గించుటకు సురక్షిత పని విధానాలు, పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌కే-5, 6గ్రూపు ఏజెంట్ ఏవీ రెడ్డి, విజయ్‌కుమార్, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.